క్లుప్తంగా

నేడు శంకుస్థాపనలు

క్రోసూరు: మండలంలోని 88త్యాళ్లూరులో సోమవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు రూ.6.30 కోట్ల పీఎంజీఎస్‌వై నిధులతో 88త్యాళ్లూరు, ఉయ్యందన, అనంతవరం నుంచి మిట్టపాలెం మీదుగా పెదపాలెం వరకు తారురోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి దర్శి వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. మండలంలో రూ.6.30 కోట్ల పీఎంజీఎస్‌వై నిధులతో దొడ్లేరు నుంచి హసానాబాద్, నాగవరం మీదుగా రెడ్డిగూడెం వరకు తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు క్రోసూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అచ్చంపేట, క్రోసూరు మండలాల పార్టీ నాయకులతో మార్చి 3 సిద్ధం సభకు సన్నాహక సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. కావున పార్టీ నాయకులు తప్పకుండా సమావేశానికి హాజరుకావాలని అన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 ప్రిలిమినరీ

సత్తెనపల్లి: గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. సత్తెనపల్లి మండలం కంటెపూడి సమీపంలోని నలంద ఇంజనీరింగ్ కళాశాల, ధూళిపాళ్ల సమీపంలోని లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించారు. రెండు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1,200 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 869 మంది హాజరయ్యారు. లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో 480 మందికిగాను 356 మంది హాజరుకాగా, నలంద ఇంజనీరింగ్ కళాశాలలో 720 మందికిగాను 513 మంది హాజరయ్యారు. లయోలా ఇంజనీరింగ్ కళాశాలకు సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, నలంద ఇంజనీరింగ్ కళాశాలకు బెల్లంకొండ తహసీల్దార్ ఐఎస్ ప్రసాద్ ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరించారు.

విద్యార్థులకు అల్పాహారం

పెదకూరపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్థానిక జన చైతన్యసమితి ఆధ్వర్యంలో అల్పాహారం ఆదివారం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు శాఖమూరి వెంకటేశ్వర్లు నాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు బలవర్ధకమైన ఆహారం కూడా అవసరమన్నారు. అల్పాహారం అందించిన జనచైతన్య సమితి సభ్యులను అభినందించారు. సత్తెనపల్లి డివిజన్ ఎల్ఐసీ అసోసియేషన్ అధ్యక్షుడు మంచాల రమేష్ మాట్లాడుతూ ప్రత్యేక తరగతులు జరుగుతున్న అన్ని రోజులు వారికి అల్పాహారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చియ్యపాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు, ప్రధానోపాధ్యాయులు కాకాని వెంకటరమణ, ఉపాధ్యాయులు నాగరాజు, రాధకృష్ణ, జనచైతన్యసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి విజయబెన్నిబాబు, కో–ఆర్డినేటర్ వెలితోటి అనిల్‌కుమార్, షేక్ మాబు పాల్గొన్నారు.

జగన్నాథ స్వామికి వసంతోత్సవం



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో వేంచేసియున్న సుభద్ర బలభద్ర సహిత జగన్నాథ స్వామి పుష్కర కుంభాభిషేక వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి వారికి వసంతోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమాలు, చక్రస్నానం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి వారికి వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

29న భక్తాంజనేయస్వామి వార్షికోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో ఉన్న భక్తాంజనేయ స్వామి వారి దేవస్థానం 24వ వార్షికోత్సవం ఈ నెల 29న జరుగుతుందని ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. 29న ఉదయం 8 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, 8.30 గంటలకు పంచామృత స్నపన, 10 గంటలకు విశేష అలంకరణ, 11 గంటలకు తీర్థ ప్రసాద వినియోగం జరుగుతుందన్నారు. 12 గంటలకు అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ, రాత్రి 8 గంటలకు శ్రీనివాస పద్మావతి కోలాట బృందంచే కోలాట ప్రదర్శన జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఏపీ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా జానీ



సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్ జానీ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆయన నియామక ఉత్తర్వులు అందుకున్నారు. తనపై ఎంతో నమ్మకంతో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమించిన అసోసియేషన్ బాధ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వేగంగా.. కచ్చితంగా..

- ఏరియా వైద్యశాలలో రూ.20 లక్షల విలువైన ఫుల్లీ ఆటోమెటిక్ అనలైజర్ ఎక్సెల్-640 మిషన్ ఏర్పాటు
- దీని ద్వారా 640 రకాల రక్తపరీక్షలు
- పైసా ఖర్చులేకుండానే రోగనిర్ధారణ
- రోగులకు తప్పిన ఇబ్బందులు

నాడు.. గత టీడీపీ పాలనలో ప్రభుత్వ వైద్యశాలల్లో ల్యాబ్‌ల నిర్వహణ అధ్వానంగా ఉండేది. మెడాల్ సంస్థకు అవకాశం ఇచ్చి, ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశారనే విమర్శలు ఉన్నాయి. రక్త నిర్ధారణ పరీక్షల రిపోర్టులు కూడా సకాలంలో అందేవి కావు. దీంతో రోగులు, గర్భిణులు రక్త పరీక్షల కోసం ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వచ్చేది. ఒక కార్డియాలజీ టెస్టుకు రూ.2,500, పెరాలసిస్, స్నేక్ బైట్, బ్లడ్ కాట్ కోసం రూ.1,000, హెచ్‌బీఏ1సీకి రూ.600, ఇలా వేలల్లో వెచ్చించాల్సి ఉండేది.

నేడు.. పేద రోగులపై పైసా భారం పడకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వైద్యశాలల అభివృద్ధితో పాటు రక్త నిర్ధారణ పరీక్షల కోసం అధునాతన యంత్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ వైద్యశాలలోనే ఉచితంగా అన్ని రకాల పరీక్షలను చేస్తుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది.

సత్తెనపల్లి: ప్రజా ఆరోగ్యమే పరమావధిగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ వైద్యశాలల రూపురేఖలు మార్చేసింది. అవసరమైన చోట నూతన భవనాలు నిర్మించడం, కొన్ని చోట్ల భవనాలను ఆధునీకరించడంతో పాటు అన్ని మౌలిక వసతులను కల్పించింది. అలాగే అధునాతన పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకి రక్త పరీక్షల కోసం రూ.20 లక్షల వ్యయంతో ఫుల్లీ ఆటోమేటిక్ అనలైజర్ ఎక్సెల్–640 మిషన్‌ను సమకూర్చింది. ఈ మిషన్ ద్వారా రక్త పరీక్షలను వేగంగా, కచ్చితంగా నిర్వహించి ఫలితాలను అందజేస్తున్నారు.

పరీక్షలు ఇవి..

ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఫుల్లీ ఆటోమేటిక్ అనలైజర్ ఎక్సెల్–640 మిషన్ ద్వారా కిడ్నీ, లివర్, షుగర్, బీపీ, హెచ్‌బీ, సోడియం, పొటాషియం, క్యాల్షియం, కొలెస్ట్రాల్, ప్లేట్‌లెట్లు, హెచ్‌బీఏ1సీ, పెరాలసిస్, స్నేక్ బైట్ వారికి విషం ఎక్కిందా లేదా తదితర పరీక్షలు చేస్తారు. ఇలాంటి ఖరీదైన పరీక్షలను సైతం ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా చేస్తున్నారు. ఇది పేద రోగులకు ఊరట కల్పిస్తుంది.

రోజుకు 180 నుంచి 230 మందికి పరీక్షలు..

సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో ప్రతి రోజు 500 నుంచి 600 ఓపీలు వస్తాయి. ఇందులో 180 నుంచి 230 మందికిపైగా రక్త నిర్ధారణ పరీక్షల కోసం వస్తుంటారు. ప్రతి రోజు 84 రకాల రక్త పరీక్షలు, 2,500 నుంచి 3 వేల వరకు చేస్తారు. గంటకు 640 టెస్టులను ఈ మిషన్ ద్వారా చేయవచ్చు. 2023 మే లో మిషన్ ఏర్పాటు చేయగా డిసెంబర్ వరకు 1,85,324 రకాల రక్త నిర్ధారణ పరీక్షలు చేశారు. 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు 1,17,175 రకాల రక్త నిర్ధారణ పరీక్షలు చేశారు. సగటున ప్రతి నెలా 60 వేల రకాల చేస్తున్నారు.





సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలోని ఫుల్లీ ఆటోమేటిక్ అనలైజర్ ఎక్సెల్-640 మిషన్ (ఇన్‌సెట్) రక్త నిర్ధారణ పరీక్షలకు రక్తం తీస్తున్న సిబ్బంది

వచ్చిన వారందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రైవేట్ ల్యాబ్‌లకు పంపకుండా వేగంగా స్థానికంగానే పరీక్షలు నిర్వహించి రిపోర్టును అందజేస్తున్నారు.

అన్ని రకాల వ్యాధుల నిర్ధారణ చేస్తుంది..



ఈ మిషన్ ద్వారా అన్ని రకాలైన గుండె జబ్బు, షుగర్, బీపీ టీబీ, కిడ్నీ తదితర 640 వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేసుకోవచ్చు. బయట రక్తపరీక్షల కోసం వేల రూపాయలు ఖర్చు చేసుకోకుండా ఏరియా ప్రభుత్వ వైద్యశాలలోనే ఉచితంగా చేసుకోవచ్చు. ఫలితాలు కచ్చితంగా వస్తాయి. పేద రోగులు వినియోగించుకోవాలి.

– డాక్టర్ బి.లక్ష్మణరావు, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్, సత్తెనపల్లి

షుగర్ ఎంత ఉందో తెలుసుకోవచ్చు..



గత ప్రభుత్వ హయాంలో ప్రైవేట్ సంస్థకు రక్తపరీక్షల నిర్ధారణ ఇచ్చి రూ.కోట్లు దుర్వినియోగం చేశారు. రోగులకు రక్త పరీక్షల రిపోర్టులు సైతం సకాలంలో అందక అనేక ఇబ్బందులు పడ్డారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అధునాతన మిషన్లను ఏర్పాటు చేసి క్షణాల్లో రక్త పరీక్షలు చేయడంవలన నాణ్యమైన వైద్య సేవలు పొందగలుగుతున్నారు.

– డాక్టర్ కొత్త రామకృష్ణ, ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్, సత్తెనపల్లి

రోజుకు 230 మందికి రక్త నిర్ధారణ పరీక్షలు..



సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో అన్ని రకాల రోగులకు ఫుల్లీ ఆటోమేటిక్ అనలైజర్ ఎక్సెల్–640 మిషన్ ద్వారా రక్త నిర్ధారణ పరీక్షలు చేసే సౌకర్యం ఉంది. ప్రతిరోజు 180 నుంచి 230 మంది వరకు రక్త పరీక్షల కోసం వస్తున్నారు. వారికి పైసా ఖర్చు లేకుండా ఉచితంగా వేగంగా కచ్చితంగా రక్త నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం.

–సయ్యద్ మహ్మద్ అలీ, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్, సత్తెనపల్లి

విదేశాల్లో విద్యనభ్యసించే వారికి చేయూత అందించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

సత్తెనపల్లి: విదేశాల్లో విద్యను అభ్యసించి స్థిరపడాలని ఎంతో మంది పేద, మధ్యతరగతి వారికి బలమైన ఆకాంక్ష ఉంటుందని అయితే వారికి సరైన మార్గం లేక దారి చూపించే వారు లేక ఇబ్బంది పడుతున్నారని అలాంటి వారికి ఈ కన్సల్టెన్సీ మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావులు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని పాతబస్టాండ్ సెంటర్‌లో పల్నాడు ఓవర్సీస్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ కేంద్రాన్ని ఆదివారం వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పల్నాడు ప్రజలకు ఇలాంటి విద్యా సేవా కార్యక్రమాలు ప్రారంభించడం అభినందనీయమన్నారు. కన్సల్టెన్సీ నిర్వాహకులు బండారు అజయ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల నాయకులు బాసు లింగారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, అచ్యుత శివప్రసాద్, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు, సోషల్ మీడియా సభ్యులు, తదితరులున్నారు.

ఘనంగా అంకమ్మతల్లి తిరునాళ్ల



అంకమ్మతల్లి ఆలయంలో పూజలు చేస్తున్న రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు

రాజుపాలెం: మండల కేంద్రంలో కొలువుదీరిన అంకమ్మతల్లి తిరునాళ్ల ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి రాజుపాలెం–గంగిరెడ్డిపాలెం భక్తులు తొలి ధాన్యపు కంకులతో పొంగళ్లు చేసి, మేళతాళాలతో బోణాలు సమర్పించారు. అమ్మవారికి చీర, సారెలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కోలాటాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మొక్కులు తీర్చుకున్న రాష్ట్ర మంత్రి అంబటి..

తిరునాళ్ల సందర్భంగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పూజారి అర్వపల్లి కోటి నారాయణమూర్తి ఆయనను ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం సహోదయ ఇంగ్లీషు మీడియం పాఠశాల ఏర్పాటు చేసిన చక్కెరపొంగలి ప్రసాదాన్ని ఎమ్మెల్యే అంబటి ప్రారంభించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సునీతాశ్రీనివాసరెడ్డి, సర్పంచ్ పులిబండ్ల అశోక్, లాయర్ పక్కాల సూరిబాబు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొడ్లేరులో నూతన మసీదు, మదర్సా ప్రారంభం



నూతనంగా నిర్మించిన మసీదులో ప్రసంగిస్తున్న మత పెద్దలు

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామంలోని కొండూరు రోడ్డులో నూతనంగా నిర్మించిన మసీదు, మదర్సాను ఆదివారం ప్రారంభించారు. ఇఫ్తితాహే మస్జీద్ అక్సా అవుర్ మదరసా ప్రారంభానికి ఉలేమాలు గుంటూరు నుంచి ఉలేమా హజ్రత్ మౌలానా ముజ్మిల్‌అహ్మద్, సత్తెనపల్లి హజరత్ ముఫ్తి అష్రఫ్ అహ్మద్, అజీజుర్ రహ్మాన్ అబ్దుల్ బాసిత్ హాజరై ప్రసంగించారు. నూతన మసీదులో ముస్లింలు నమాజులు ఆచరించాలని, అదేవిధంగా మదర్సాలో గ్రామ ముస్లింలు తమ పిల్లలను ఉర్దూ, ఖురాన్ నేర్చుకునేందుకు చేర్పించాలన్నారు. ఇస్లాం గ్రంథాలు నేర్చుకోవటం ద్వారా ముస్లిం సంస్కృతి, సంప్రదాయాలు, ఇస్లాం మార్గం తెలుసుకుని కుటుంబానికి, ముస్లిం సమాజానికి తోడ్పడతారని అన్నారు. కార్యక్రమంలో దొడ్లేరు గ్రామ ముస్లింలు ఆశేషంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షబ్బేబేరాత్ పురస్కరించుకుని రాత్రి జాగరణ చేసి ప్రత్యేక నమాజులు ఆచరించారు.

హెచ్‌ఐవీపై అవగాహన

దాచేపల్లి : ఎయిడ్స్ వ్యాధి నివారణపై ఆదివారం కళాజాత బృందం కళాకారులు ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్థానిక లైబ్రరీ సెంటర్‌లో హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాధి నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, అవగాహన ద్వారానే హెచ్‌ఐవీని దూరం చేయవచ్చునని రీడ్స్ సంస్థ ప్రతినిధి కొమలి అన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నాగేశ్వరరావు, కోటేశ్వరి, గీతా, యలమంద, కళాకారులు మల్లిఖార్జునరావు, శివరామకృష్ణ, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో బుల్లెట్‌పై మంత్రి అంబటి పర్యటన



టీ కొట్టు వద్ద నాయకులతో బుల్లెట్ ఆపి ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: కుయ్ కుయ్ మనే ప్రొటోకాల్ సైరన్‌లు లేవు.. ముందూ వెనుకా సెక్యూరిటీ ఆర్భాటాలు లేవు.. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు బుల్లెట్ బైక్‌పై పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలో ఆదివారం వేకువజామున చక్కర్లు కొట్టారు. ప్రతి కూడలిలో బుల్లెట్ ఆపి.. ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని లక్ష్మీటాకీస్ సెంటర్‌లో టీ దుకాణం వద్ద.. భాయ్ ఏక్ ఛాయ్ అంటూ టీ తాగుతూ చక్కటి చిరునవ్వులు చిందించారు. దారిలో అవ్వ, తాతలను ఆపి.. నేనెవరో తెలుసా అంటూ వారితో చమత్కరించారు. అయ్యా .. మీరు మా ఎమ్మెల్యే మంత్రి అంబటి రాంబాబు కదా.. మాకెందుకు తెలియదూ అంటూ వారు రెండు చేతులు జోడిస్తుంటే సంతోషం వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడటంతో ఇక మంత్రి అంబటి రాంబాబు టాప్ గేర్ వేయనున్నారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, నరసింహారావు, అచ్యుత శివప్రసాద్, వల్లెం నరసింహారావు, రవికుమార్, ప్రసాద్ బాబు, సాయి, సతీష్, తదితరులున్నారు.

త్రిశక్తి దేవాలయానికి విరాళం

పెదకూరపాడు: పెదకూరపాడులో వేంచేసిన మహాలక్ష్మీ, మహాసరస్వతి సమేత కన్యకాంబాదేవి దేవస్థానంలో దీప ధూప నైవేద్యాల నిమిత్తం గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణానికి చెందిన కనమర్లపూడి కుచేలరావు, ఆయన ధర్మపత్ని రమాదేవిల జ్ఞాపకార్థం వారి కుమారులు రమేష్‌కుమార్, వారి కుటుంబ సభ్యులు రూ.50,116 ఆర్థిక సహాయం ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు దాతలను సత్కరించారు.

నాటుసారా స్వాధీనం



వెల్దుర్తి: మండలంలోని రచ్చమల్లపాడు గ్రామంలో ఆదివారం మాచర్ల స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కిషోర్ సిబ్బందితో కలిసి దాడులు చేసి ఉడతల సావిత్రి వద్ద ఉన్న 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఆదివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిని మాచర్ల మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు. సావిత్రి ఇచ్చిన సమాచారం మేరకు పిచ్చయ్యబావి తండాకు చెందిన బాణావత్ గోవిందునాయక్ వద్ద నుంచి నాటుసారాను తీసుకొచ్చినట్లు చెప్పటంతో గోవింద నాయక్‌ను నిందితుడిగా చేర్చినట్లు పేర్కొన్నారు. త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకుడు



పార్టీలో చేరిన కొండూరు 6వ వార్డు మెంబరు బాలరాజుకు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే నంబూరు

అచ్చంపేట: టీడీపీలో మరో వికెట్ డౌన్ అయింది. మండలంలోని కొండూరులో టీడీపీకి బలమైన నాయకుడు పంచాయతీ 6వ వార్డు మెంబరు కడిమెళ్ల బాలరాజు, వారి భార్య సాంబ్రాజ్యమ్మ ఆదివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తాను అండగా ఉంటానని చెప్పారు. వైఎస్సార్‌సీపీ చేస్తున్న అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులయి టీడీపీని వీడి, వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని చెప్పారు. బాలరాజు మాట్లాడుతూ ఇంతకాలం టీడీపీలో ఉండి ఏమి సాధించుకోలేక పోయానని, కనీసం ఒక్క పెన్షన్ కూడా ఇప్పించుకోలేదన్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఎలాంటి వివక్ష లేకుండా అర్హత ఉన్నవారందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. అందువల్లనే టీడీపీకి స్వస్తి చెప్పి తన అనుచరవర్గంతో వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు చెప్పారు. రానున్న ఎన్నికలలో ఎంపీగా అనిల్‌కుమార్ యాదవ్‌ని ఎమ్మెల్యే నంబూరు శంకరరావును భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు చొప్పరపు రామయ్య, సైదరాజు, కొండూరు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దొడ్లేరులో కల్యాణ మండపం ప్రారంభం



దొడ్లేరులో రాయపాటి కల్యాణ మండపాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామానికి చెందిన డాక్టర్ రాయపాటి సాయికృష్ణ, డాక్టర్ హారిక దంపతులు నిర్మించిన రాయపాటి కల్యాణ మండపం గ్రామానికే తలమానికం లాంటిందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. ఆదివారం కల్యాణ మండపాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ గ్రామంలో ఇటువంటి కార్యక్రమాలు చేపట్టటం సంతోషకరమన్నారు. గ్రామ ప్రజలకు కల్యాణ మండపం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు పట్టణానికి వెళ్లే అవసరం లేకుండా గ్రామంలోనే శుభకార్యాలు, సమావేశాలు లాంటివి నిర్వహించుకోవచ్చన్నారు. సకల సౌకర్యాలతో నిర్మించిన కల్యాణ మండపాన్ని గ్రామ ప్రజలు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయపాటి సాయికృష్ణ కుటుంబీకులు, సర్పంచ్ ముక్కు అంజలి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ముస్లిం, మైనార్టీల ద్రోహి చంద్రబాబు

- 99 స్థానాల్లో ఒకే ఒక్క సీటు కేటాయించడం దారుణం
- జనాభా ప్రకారం 10 స్థానాలు ముస్లింలకు కేటాయించాలి
- టీడీపీలో సామాజిక న్యాయానికి స్థానం లేదు



పెదకూరపాడులో విలేకర్ల సమావేశంలో పాల్గొన్న ముస్లిం సోదరులు

పెదకూరపాడు: చంద్రబాబు రాజకీయ జీవితం అంతా ముస్లిం, మైనార్టీలకు ద్రోహం చేయడమే అని వైఎస్సార్‌సీపీ పెదకూరపాడు నియోజకవర్గ కన్వీనర్ షేక్ మస్తాన్ షరీఫ్, వైస్ ఎంపీపీ షేక్ చాంద్ బాషా, క్రోసూరు వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ సుభానీలు అన్నారు. పెదకూరపాడులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ 2014లో కూడా ముస్లింలకు ఒకే స్థానం కేటాయించారని గుర్తు చేశారు. టీడీపీ, జనసేన మొదటి విడత జాబితో ఒకే స్థానం ముస్లింలకు కేటాయించడంతో వారికి ముస్లింలపై ఉన్న చిన్నచూపు మరోసారి బయటపడిందన్నారు. జనాభా ప్రకారం ముస్లింలకు 10 స్థానాలు కేటాయించాల్సి ఉండగా కేవలం ఒకే స్థానం కేటాయించారన్నారు. టీడీపీలో సామాజిక న్యాయానికి స్థానం లేదన్నారు. ముస్లిం సోదరులు గమనించి రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, దాని మిత్రపక్షాలను ఓడించేందుకు సిద్ధం కావాలన్నారు. వైఎస్సార్‌సీపీతోనే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు ప్రకటించిన సమన్వయకర్తలలో ముస్లింలకు 7 స్థానాలు కేటాయించారన్నారు. టీడీపీ పెత్తందారుల పార్టీ అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ముస్లిం సోదరులు అండగా ఉంటారన్నారు. ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

చురుగ్గా జలజీవన్ మిషన్ పనులు



పెద్దమక్కెనలో జరుగుతున్న జలజీవన్ మిషన్ పనులు

సత్తెనపల్లి: గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇంటింటికి మంచినీటి కొళాయి ఏర్పాటు చేసేందుకు గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్ పనులు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుంది. దీనిలో భాగంగా సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన గ్రామంలో రూ.1.53 కోట్ల నిధులతో జలజీవన్ మిషన్ పనులకు ఈ నెల 16న రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు శంకుస్థాపన చేశారు. ఇంటింటికి మంచినీటి కొళాయి ఏర్పాటు చేయాలనే సదుద్దేశంతో చేపట్టిన ఈ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. త్వరితగతిన పనులు పూర్తి చేసి ఇంటింటికి కొళాయి ఏర్పాటు చేయనున్నారు. అధికారుల పర్యవేక్షణలో నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపడుతుండడంతో గ్రామస్తులు హర్షం వెలిబుచ్చుతున్నారు.

శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఏకాహం



నకరికల్లు: స్థానిక కొండపై వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన 24 గంటల ఏకాహం ఆదివారం ఉదయం ముగిసింది. కొండపై స్వయంభువుగా వెలసిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనర్సింహస్వామి వారికి విశేష చరిత్ర ఉంది. మాఘ పౌర్ణమి సందర్భంగా భజన బృందం ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి 24 గంటల పాటు ఏకాహం చేశారు. ఆలయ అర్చకులు కొడవటికంటి మధుసూధనాచార్యులు, పాండురంగాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి విశేష అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరిచారు. ఏకాహం ముగింపు సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అనంతరం దాతలు, భక్తులు, గ్రామస్తుల సహకారంతో మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

నూర్‌బాషా సంఘ అధ్యక్షునిగా హస్సేన్

అచ్చంపేట: అచ్చంపేట గ్రామ నూర్‌బాషా సంఘ అధ్యక్షునిగా షేక్ హస్సేన్‌తోపాటు మరో 10 మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక పడమర బజారులోని పీర్ల చావిడి వద్ద శనివారం రాత్రి సంఘ సభ్యులంతా సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన షేక్ హస్సేన్‌ను, కార్యవర్గ సభ్యులను సంఘ పెద్దలు అభినందించారు.